క్లుప్తంగా

చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్‌కు చెందిన సామాజిక సేవా కార్యకర్త, చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు పలువురు చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మల్కాపురంలో గురువారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ నెల రోజుల పాటు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని, చిన్నారులు తెలుపు పేపర్లు, రంగు పెన్సిళ్లు, కలర్స్, ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. చిన్నారులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పి, వారిని జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తానని చెప్పారు.

నార సంచుల పంపిణీ



గోపాలపట్నం రైతు బజారులో నార సంచులు అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం : గోపాలపట్నం రైతు బజారులో నార సంచులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు వినియోగదారులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే సంచులు వాడాలని సూచించారు. ఈ సంచుల్ని వెంకటాపురం కుమారి కేటరింగ్ యజమాని దవల గోపాల్ సమకూర్చారని తెలిపారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ అధికారి నారాయణరావు, ధవల మోహన్, భూషణం మాస్టార్, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సరకుల అందజేత



సమకూర్చిన సరకులతో చర్చి సభ్యులు

విశాఖ విద్య : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేవియర్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు అందజేశారు. ఈ మేరకు జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీ నగర్‌లో గల చర్చి సంఘం సభ్యుల సహకారంతో సమకూర్చిన సరకులను రెవరెండ్ పాస్టర్ లంకపల్లి జాకబ్ రాజు నేతృత్వంలో గురువారం విజయవాడ తీసుకెళ్లి అందజేశారు. విపత్తు సమయాల్లో మానవత్వంతో ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ నేతల శేఖర్, పీసీసీ మెంబర్స్ కె.జాన్ సుధాకర్, ఎస్పీ ప్రసన్న కుమార్, కుండా విజయ్ కుమార్, కోనాల కరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో అన్నదానం

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ యూత్ కమిటీ నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గణబాబు, మల్కాపురం సీఐ విద్యాసాగర్, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు అతిథులను శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్షణ దళం.. సేవాగుణం

- ప్రజల ప్రాణాలు కాపాడుతున్న రైల్వే పోలీసులు
- కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చుతున్న సిబ్బంది
- సింహాచలం రైల్వే స్టేషన్ల పరిధిలో నిబద్ధతతో విధుల నిర్వహణ





సింహాచలం రైల్వేస్టేషన్‌లో బాధితులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు(ఫైల్)

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ అంటే గతంలో సూసైడ్ స్పాట్‌గా ఉండేది. తెల్లవారితే ఎక్కడ ఏ మృతదేహం కనిపిస్తుందోనని స్థానికులు ఆందోళనతో ఉండేవారు. ఇప్పుడు రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) పోలీసుల నిఘా ఎక్కువ కావడంతో చాలా మంది ప్రాణాలను కాపాడుతున్నారు. చనిపోదామని వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చుతున్నారు. రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న విలువైన వస్తువులను వెతికి పట్టుకుని తిరిగి వారికి అప్పగిస్తున్నారు. ఇలా నిబద్ధతతో ఆర్పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. వీరి సేవలను చూసిన ప్రజలు, ఉన్నతాధికారులు శభాష్ అంటూ మెచ్చుకుంటున్నారు.

నలుగురిని కాపాడారు..

ఇటీవల సింహాచలం రైల్వే స్టేషన్ పరిధిలో ముగ్గురిని, నార్త్ రైల్వే స్టేషన్ వద్ద ఒక మహిళను ఆర్పీఎఫ్ పోలీసులు కాపాడి వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు.

- సింహాచలం నార్త్ రైల్వే స్టేషన్ వద్ద ఒక మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చింది. అదే సమయంలో విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్ ఆమె పరిస్థితిని చూసి మాట కలిపింది. ఆమె వివరాలు ఆరా తీసింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సమక్షంలో మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు.
- చదువుపై ఆసక్తి లేదని ఎటో వెళ్లిపోయేందుకు సింహాచలం రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా సుజాతనగర్‌కు చెందిన ఓ విద్యార్థి తిరుగుతుంటే ఆర్పీఎఫ్ పోలీసులు ఆపి విచారించారు. తొలుత వివరాలు తెలిపేందుకు బాలుడు నిరాకరించినా.. బుజ్జగించి వివరాలు సేకరించారు. బాలుడి తల్లికి ఫోన్‌చేసి సింహాచలం రైల్వే స్టేషన్‌కు రప్పించారు. ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి విద్యార్థిని ఇంటికి పంపించారు.
- మతి స్థిమితం లేని ఒక యువతి సింహాచలం రైల్వే స్టేషన్‌లో తిరగడాన్ని గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు ఆమెకు రక్షణ కల్పించి మమత చారిటబుల్ ట్రస్ట్‌కు అప్పగించారు.
- సింహాచలం రైల్వే స్టేషన్‌లోని 2వ నంబర్ ప్లాట్‌ఫారంపై ముభావంగా తిరుగుతున్న ఓ వివాహితను గమనించి వివరాలు ఆరా తీశారు. వివాహితకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె భర్త, అక్కకు అప్పగించారు.

అవగాహన కార్యక్రమాలు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్పీఎఫ్ ఎస్ఐ మమత నాయక్ పలు పాఠశాలలు, కళాశాలల్లో రైల్వే సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే ఆస్తులంటే ప్రజల ఆస్తులేనని విద్యార్థులకు వివరించారు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి దిగేందుకు యత్నించడం, రాళ్లు రువ్వడం, రైల్వే ట్రాక్‌పై నుంచి దాటడం వంటివి చేయరాదని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటివి రైలులో, స్టేషన్‌లో రవాణా చేయరాదని, విద్యార్థులు వాటికి జోలికి వెళ్లకూడదని అవగాహన కల్పిస్తున్నారు.

అనధికార పార్కింగ్‌పై కఠిన చర్యలు

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా వాహనాలు నిలపడం నేరమని, అనధికార పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్పీఎఫ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో కుటుంబ సభ్యులను డ్రాప్‌చేసి వెళ్లిపోవాలని, పికప్‌కు వచ్చేవారు స్టేషన్ ప్రాంగణంలో గంటల కొద్దీ వేచి ఉండకూడదని సూచిస్తున్నారు. రాంగ్ పార్కింగ్ చేసినా, గంటల కొద్దీ వేచి ఉన్నా జరిమానా విధిస్తామని పేర్కొంటున్నారు.



నార్త్ సింహాచలం స్టేషన్ వద్ద మహిళను కాపాడి వివరాలు సేకరిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

ప్రజల సహకారంతో మరింతగా సేవలు



ప్రజలు, ప్రయాణికుల సహకారంతో రైల్వే స్టేషన్‌ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతాం. ఇటీవల నలుగురిని రక్షించగలగడం చాలా సంతోషాన్నిచ్చింది. ఉన్నతాధికారుల సహకారంతో మర్రిపాలెం నుంచి సింహాచలం వరకు ఉన్న రైల్వే స్టేషన్ పరిధిలో నిత్యం నిఘా పెడుతున్నాం. డ్రగ్స్, గంజాయి వంటివి స్టేషన్‌లోకి రాకుండా గట్టి చర్యలు చేపట్టాం. మాకు, మా సిబ్బందికి చక్కని సహకారం అందిస్తున్న మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మమతకు ధన్యవాదాలు.

– మమత నాయక్, ఆర్పీఎఫ్ ఎస్ఐ

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా: ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అధికారులు గురువారం 63వ వార్డులో ఇంటి పన్నుల మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొని ఇంటి పన్నుల విషయంలో ప్రజల పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను చక్కదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, కోరుబిల్లి రాము, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మమత

విశాఖ విద్య : ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత నిరాశ్రయులకు గురువారం దుప్పట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఇప్పటి వరకు 168 మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించామన్నారు. 52 మంది మానసిక వికలాంగులకు మెంటల్ కేర్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందించామన్నారు. 48 మందిని వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చామని తెలిపారు. షెల్టర్‌లో ఆరుగురికి ఉపాధి చూపించామన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధి తమ్మరావు

మల్కాపురం : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని అనేక మార్లు కేంద్రానికి, సెంట్రల్ పీఎఫ్ కార్యాలయానికి ఉత్తరాలు రాసినా స్పందన లేదని పెన్షనర్స్ సంఘం ప్రతినిధి తమ్మరావు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద పారిశ్రామిక ప్రాంత పెన్షనర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ సమస్యపై కేంద్ర పాలకులు, అధికారులతో పలుమార్లు మాట్లాడామన్నారు. వారి నుంచి హామీలు వస్తున్నాయి తప్ప చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ లేక చాలా మంది విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికే మా వయస్సు 70 ఏళ్లు దాటుతోందని, ఇంకెన్నాళ్లు నిరీక్షించాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 'గైస్' విద్యార్థుల సత్తా



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, ఇతర అధ్యాపకులు

మురళీనగర్ : కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో గైస్ విద్యార్థులు సత్తా చాటారు. ఇప్పటికే ఈ కాలేజీ నుంచి 150 మందికిపైగా ఉద్యోగాలు సాధించడంతోపాటు అత్యధికంగా పది లక్షల రూపాయల ప్యాకేజీతో ఒక విద్యార్థి ఉద్యోగం సాధించిన విషయం విదితమే. తాజాగా ఈ కాలేజీ నుంచి 10 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు అమ్మాయిలున్నారు. బి.విజయశ్రీ కార్తీక్, ఆళ్ల మౌనిక ప్రియ, జె.శ్రావణి శృతి, ఆదరి గణేష్, దొడ్డి జగదీశ్ చక్రి, బి.మోహన్ కుమార్, పి.లక్ష్మణ్ చరణ్, జి.బాలాజీ, ఎంవీ నరేష్ వర్మ, బి.షణ్ముఖరావు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి మొదటి సంవత్సరం రూ.2లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తారు. రెండో ఏడాది నుంచి రూ.3 లక్షల ప్యాకేజీ చెల్లిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి విద్యార్థులను అభినందించారు.

ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రజల సంరక్షణ కోసం వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు అందజేస్తూ విశేష సేవలందిస్తున్నారని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.మీనాక్షిని అభినందించారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతుల్లో ఉచితంగా కంటి పరీక్షలు, అవసరమైన చికిత్స అందిస్తున్నామని... అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ నవీన్ కుమార్, నేత్ర వైద్యశాల వైద్యులు, జూనియర్ వైద్యులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుని సన్నిధిలో దసరా ఉత్సవాలు ప్రారంభం



పద్మావతి అమ్మవారికి రాగి తాపడం చేసిన ఆభరణాలు అందిస్తున్న దాతలు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా త్రిరాత్రి పూజా మహోత్సవాలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5 గంటలకు ఆలయంలోని పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో కలశ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సహస్ర కుంకుమార్చన అనంతరం తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని, వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం మహార్నవమి సందర్భంగా కలశం యందు సరస్వతి ఆరాధన, పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

పద్మావతి అమ్మవారికి ఆభరణాల వితరణ

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా స్వామి భక్తులు పద్మావతి అమ్మవారికి రాగి ఆభరణాలు అందించారు. విగ్రహ దాత మధుమోహన్ దంపతులు, నాగరాజు దంపతులు రాగితో తాపడం చేసిన కిరీటంతోపాటు ఇతర ఆభరణాలను ఆలయ ఈవో బండారు ప్రసాద్‌కు అందించారు.

జయహో దుర్గా భవానీ



గణపతినగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి కిరణ్, తదితరులు



కొత్తపాలెంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అయితంశెట్టి గోపాలకృష్ణ

గోపాలపట్నం : శరన్నవరాత్రి సందర్భంగా గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గవర వీధిలో యంగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో చండీహోమం నిర్వహించారు.

- కొత్తపాలెం విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసి 89వ వార్డులోని పలు మండపాల్లో అన్నసమారాధన చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు అయింశెట్టి రణుకా గోపాల కృష్ణ పాల్గొని ప్రసాదం వడ్డించారు.
- జీవీఎంసీ 89వ వార్డు గణపతినగర్‌లో దుర్గాదేవి మండపం వద్ద అన్నసమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ పాల్గొని మండపంలో విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో మహాలక్ష్మినాయుడు, సూర్యనారాయణ, జగ్గారావు, గురునాథరావు, కూర్మారావు పాల్గొన్నారు. జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో ఎమ్మెల్యే గణబాబు దుర్గాదేవిని దర్శించుకున్నారు.



గొల్లవీధిలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు

న్యూ కరాసలో అన్నసమారాధన

విశాఖ విద్య : శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను 52వ వార్డ్ న్యూ కరాస హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహం వద్ద వైభవంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించి భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో 52వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వెంకు మహంతి చంద్రశేఖర్, వినోద్ రెడ్డి, నాగిరెడ్డి, విమ్మద్ది శ్రీను, వేణుమాధవ్, అంజిరెడ్డి, రుద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం రెండు గుడుల వద్ద షైనింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి పూజల్లో ఎమ్మెల్యే పి.గణబాబు, 58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను, రామ్మోహన్‌నాయుడు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద డేరింగ్ అండ్ డేషింగ్ యూత్ ఆధ్వర్యంలో కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. 58వ వార్డు గుల్లలపాలెంలో దుర్గాదేవి మండపం వద్ద దీపారాధన, భజన చేశారు.



దుర్గాపురంలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు



షైనింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో పూజల్లో ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులో యంగ్ వండర్స్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబును కమిటీ సభ్యులు సత్కరించి తీర్థప్రసాదం అందజేశారు.

'రన్ ఫర్ అంబేడ్కర్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, నిర్వాహకులు

విశాఖ సిటీ: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న ఆర్కే బీచ్‌లో నిర్వహించనున్న రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. రాజ్యాంగ గొప్పతనం, పౌరులకు సంక్రమించిన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, ఇంత అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అలుమ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఏయూ విద్యార్థి పరిశోధక బోధన, బోధనేతర సిబ్బంది, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, భీమ్‌సేన వారి భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగం కావాలని కోరారు. దీనికి రిజిస్ట్రేషన్ ఉచితమని, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ టీ షర్టు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు రన్ కొనసాగుతుందని, బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. 10 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.రాజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అలుమ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్, ప్రధాన కార్యదర్శి ఆరేటి మహేష్ బాబు, స్టాటిస్టిక్స్ విభాగం పూర్వ ఆచార్యుడు వివేకానందమూర్తి, డాక్టర్ బోరుగడ్డ మోహన్ బాబు, ఏయూ ఎస్సీ ఎస్టీ, బీసీ–సీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య టి.షారోన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.